

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

# అంటుకుంటే బుగ్గే..

**మండు వేసవి కాలం ప్రమాదాలకు ఊతం**

- నిర్మల్ జిల్లాలో 117 అగ్ని ప్రమాద కేసులు
- రూ.93.42 లక్ష ఆస్తి నష్టం
- ప్రమాదాల్లో రూ.4 కోట్ల ఆస్తిని కాపాడిన అధికారులు
- నిబంధనలు పాటిస్తే ఆస్తితోపాటు ప్రాణాలు సురక్షితం

**ప్రాంతాలవారీగా ఫైర్ స్టేషన్ మొబైల్ నంబర్లు..**

| | | |
|---|---|---|
| నిర్మల్ | : | 87126 99218 |
| భైంసా | : | 87126 99222 |
| ఖానాపూర్ | : | 87126 99221 |

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 13 : ఎండలు మండుతుండడంతో అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యాపార, వాణిజ్య ప్రదేశాలు, పత్తి పరిశ్రమలు, గోదాములు, ఇండ్లలో అధికంగా జరగనున్నాయి. ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలంటూ అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. కాగా.. జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈనెల మార్చి 31 వరకు 117 అగ్నిమాపక కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా నిర్మల్ ఫైర్ స్టేషన్ పరిధిలో 51, అత్యల్పంగా ఖానాపూర్ పరిధిలో 19 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో రూ.93.45 లక్షల ఆస్తినష్టం జరిగింది. సకాలంలో మంటలను ఆర్పడంతో దాదాపు రూ.4.12 కోట్ల ఆస్తి మంటల్లో బూడిద కాకుండా కాపాడారు.

### సమాచారం అందించండి..

*అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినట్లయితే విలువైన ప్రాణాలు, ఆస్తిని కాపాడుతాం. కళాశాలలు, పాఠశాలలు, బహుల అంతస్తుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫైరింజన్ వచ్చే వరకు ఎదురు చూడకుండా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాలి. జిల్లాలో మూడు అగ్నిమాపక కేంద్రాలున్నాయి. నిర్మల్ ప్రాంతం వారు 8712699218 నంబర్, భైంసా ప్రాంతం వారు 8712699222, ఖానాపూర్ వారు 8712699221 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. చిన్న చిన్న ప్రమాదాలను కూడా అరికట్టేందుకు ఫైర్ బుల్లెట్‌లను తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో ఫైరింజన్ వెళ్లని ప్రదేశాలకు వెళ్లి అగ్ని ప్రమాదాలను అరికడుతాం.*

**- ప్రభాకర్, అగ్నిమాపక శాఖ అధికారి.**



# కేంద్రాలపై కన్ను

- తెరపైకి మహిళా సంఘాలకు అప్పగించాలనే కొత్త వాదన
- కేంద్రాలను ప్రకటించినప్పటికీ.. కేటాయింపులో స్పష్టత కరువు
- తెరవెనుక పలువురు ప్రజాప్రతినిధుల మద్దతు
- అనుమానాలకు తావిస్తున్న అధికారుల తీరు
- వరి ధాన్యం కొనుగోళ్లపై రైతుల్లో అయోమయం

**ధాన్యం కొనుగోలు సెంటర్స్ కోసం డీసీఎంఎస్ ద్వారా ప్రైవేట్ వ్యక్తులు, పీఏసీఎస్‌ల పోటీ**



కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు (ఫైల్)

నిర్మల్, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ) : వరి ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం నెలకున్నది. వ్యవసాయ శాఖ అధికారులు యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించినప్పటికీ, కేంద్రాల కేటాయింపుల్లో స్పష్టత లేదు. కేంద్రాల ఏర్పాటుపై నిర్వాహకుల్లో అయోమయం నెలకున్నది. ప్రతి సీజన్‌లో పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్, జీసీసీ ద్వారా కొనుగోళ్లు చేపడుతారు. ఆయా ఏజెన్సీలకు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని బట్టి సెంటర్లను కేటాయిస్తారు. పీఏసీఎస్‌ల ద్వారా సొసైటీల్లో పని చేస్తున్న సిబ్బందితోపాటు తాత్కాలిక సిబ్బందిని నియమించుకుని ఒక్కో మండలంలో 10 నుంచి 15 సెంటర్లను నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే కొన్ని సీజన్లుగా డీసీఎంఎస్ ద్వారా ఏర్పా టు చేసే కొనుగోలు కేంద్రాలపై వివాదాలు తలెత్తుతున్నాయి. నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల అండదండలతో ఆయా సెంటర్ల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం వివాదాస్పదం అవుతున్నది. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే సెంటర్లను కొందరు రాజకీయ నాయకులు తమ అనుచరులకు ఇప్పించేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సెంటర్ల కేటాయింపులో డీసీఎంఎస్‌లో పని చేసే ఓ కీలకమైన వ్యక్తి హస్తం కూడా ఉన్నదని ప్రచారం జరుగుతున్నది. సదరు వ్యక్తి నేరుగా రాజకీయ నాయకులతో టచ్‌లో ఉంటూ.. వారి అనుచరులైన ప్రైవేటు వ్యక్తులకు సెంటర్లను కేటాయించేందు కు రాయబేరాలు నడిపిస్తాడని చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రైవేటు వ్యక్తులు సెంటర్ల నిర్వహణ ద్వారా వచ్చే కమీషన్‌ను 50 శాతం డీసీఎంఎస్‌కు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినందుకు గాను ప్రభుత్వం క్వింటాలుకు రూ.32ల కమీషన్ డబ్బులను నిర్వాహకులకు చెల్లిస్తుంది. ఇందులో రూ.16 నిర్వాహకులకు, మిగిలిన రూ.16లను డీసీఎంఎస్‌కు అందజేస్తారు. ఇలా వందలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే ఈ కొనుగోలు ప్రక్రియ కాస్త వ్యాపారమయంగా మారడంతో చాలా మంది ప్రైవేటు వ్యక్తులు తమకున్న రాజకీయ పలుకుబడితో కేంద్రాలను దక్కించుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. వాస్తవానికి డీసీఎంఎస్‌ల ద్వారా కేవలం ఎరువులు విక్రయించడానికి మాత్రమే లైసెన్సులను జారీ చేస్తారు. వీరికి కొనుగోలు కేంద్రాలను కేటాయించాలన్న నిబంధన ఏదీ లేదు. ఇలా లైసెన్సు పొందిన వారిలో చాలామంది ఎరువుల దుకాణాలను సక్రమంగా నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఈ లైసెన్సును అర్హతగా చూపుతూ తమకు సెంటర్‌ను కేటాయించాలని చాలా మంది డీసీఎంఎస్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరికి తెరవెనుక కొందరు ప్రజాప్రతినిధుల మద్దతు ఉండడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

### సొసైటీలకే కేటాయించాలని డిమాండ్

మరోవైపు పీఏసీఎస్‌ల నిర్వాహకులు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటున్న తమకే కేంద్రాల ఏర్పాటులో మొదటి ప్రాధాన్యతనివ్వాలని పట్టుబడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 19 సొసైటీల ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందించడమే కాకుండా రుణాలను అందిస్తున్నారు. సొసైటీల ద్వారా ఏడాది పొడవునా రైతులకు సేవలను అందిస్తున్న తమను కాదని డీసీఎంఎస్‌కు కొనుగోలు కేంద్రాల బాధ్యతలను అప్పజెప్పడంతో సొసైటీలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయని వారు వాపోతున్నారు. కుభీర్, తానూర్ మండలాల్లో వరి సాగు చేయరు. ఆ రెండు మండలాలు పోగా మిగతా 17 మండలాల్లో కొనుగోలు కేంద్రాల కేటాయింపునకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని సొసైటీ చైర్మన్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత జనవరిలో జరిగిన డీసీఎంఎస్ ప్రత్యేక సమావేశంలో డైరెక్టర్లుగా ఉన్న ఆయా మండలాల పీఏసీఎస్ చైర్మన్లు మాట్లాడుతూ.. డీసీఎంఎస్‌లకు సెంటర్లు కేటాయించడం ద్వారా పీఏసీఎస్‌లు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. పీఏసీఎస్ కేంద్రాలు ఖరారు అయిన తర్వాతనే మిగిలినవి డీసీఎంఎస్‌లకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. దీంతో వారి డిమాండ్‌ను జీర్ణించుకోలేని కొందరు కీలక ప్రజాప్రతినిధులు వీరిద్దరినీ (డీసీఎంఎస్, పీఏసీఎస్) కాదని వరి కొనుగోళ్ల బాధ్యతలను ఐకేపీ మహిళా సంఘాలకు కేటాయించాలన్న కొత్త వాదనను తెరపైకి తెస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు రైతుల మేలును పక్కన బెట్టి, కొనుగోలు సెంటర్లను వ్యాపార దృష్టితో చూడడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమవుతున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ అయోమయం కారణంగానే ఇప్పటి వరకు జిల్లాలో సెంటర్ల కేటాయింపు జరగలేదు. మరో వారం, పది రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానుండడంతో ఈసారి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగుతుందా? లేదా? అన్న అనుమానాలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి.

### త్వరలోనే కేటాయిస్తాం..



*ఈ యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 308 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. త్వరలోనే కేంద్రాల కేటాయింపులు జరుపుతాం. ఈసారి ఐకేపీ మహిళా సంఘాల ద్వారా ఎక్కువగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటాం. డీసీఎంఎస్ కేంద్రాల కేటాయింపుల్లో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తాం. గతంలో ఏవిధంగా కొనుగోళ్లు జరిగాయో, ఈసారి కూడా అదేవిధంగా అన్ని ఏజెన్సీల ద్వారా పకడ్బందీగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తాం.*

**- కిశోర్‌కుమార్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్, నిర్మల్.**



సారంగాపూర్ మండలం ఆలూర్‌లో కోత దశకు వచ్చిన వరి



లక్ష్మీపూర్ బీట్ పరిధిలో కాలుతున్న అడవి

# రాజుకున్న నిప్పు

కడెం, ఏప్రిల్ 13 : కడెం మండలంలోని పలు బీట్ల పరిధిలో ఇప్పటికే రెండుసార్లు నిప్పు రాజుకోగా, తాజాగా లక్ష్మీపూర్ బీట్ పరిధిలో నిప్పు రాజుకుని అటవీ సంపదకు నష్టం వాటిల్లింది. ఇటీవల పెద్దూర్ బీట్ తోపాటు, ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని రాంపూర్‌లో భారీగా మొక్కలకు నష్టం జరగగా, ఆదివారం లక్ష్మీపూర్ బీట్‌లో మంటలు చెలరేగాయి. కడెం మండలంలో మొత్తం రేంజ్ కార్యాలయాలున్నాయి. కడెంతోపాటు, ఉడుంపూర్ రేంజ్‌లు, ఉడుంపూర్ రేంజ్‌లోని రాంపూర్ రాజుకున్న నిప్పు కారణంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన దాదాపు 20 వేల మొక్కలు నష్టపోయాయి. అలాగే కడెం రేంజ్ పరిధిలోని పెద్దూర్ బీట్‌లో భారీగా నష్టం జరిగింది. కడెం రేంజ్ పరిధిలో 21 బీట్లు ఉండగా ఒక్క అటవీశాఖ అధికారితోపాటు, డిప్యూటీ రేంజ్ అధికారులు ఇద్దరు, సెక్షన్ అధికారులు ముగ్గురు. ఏడుగురు బీట్ అధికారులు ఉండగా ఆదివారం ఇంత నష్టం జరిగిన అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కడెం-జన్నారం మండలాల పరిధిలోని నిప్పు కారణంగా అటవీ కాలుతున్న అధికారులకు ప్రయాణికులు సమాచారం ఇచ్చిన దానిని ఆపకపోవడంతో భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది.

## కత్తితో బైక్‌పై ప్రదర్శనలు చేసిన సలీం అరెస్టు

- రౌడీలు ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు
- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, ఏప్రిల్ 13 : కత్తితో బైక్‌పై ప్రదర్శనలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు వసూలు చేసిన షేక్ సలీంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో రూరల్ సీఐ ఫణిదర్, ఎస్ఐ ముజాహిత్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. బంగారిగూడకు చెందిన షేక్ సలీం తన బైక్‌పై కత్తిని నోట్లో పెట్టుకుని ప్రదర్శనలు చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కారణంగా ఆమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకుని రూరల్ పోలీస్‌లు అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇదివరకే ఏడు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు గుర్తు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు.

## చెరువంతా గుర్రపు డెక్కే..

*కేసీఆర్ పాలనలో మిషన్ కాకతీయ, ఇతర పథకాల కింద పురాతన చెరువులకు వైభవం వచ్చింది. కొత్త చెరువులు తాగు, సాగు నీరందించాయి. కాంగ్రెస్ సర్కారు చిన్న నీటి వనరులపై శ్రద్ధ పెట్టడం లేదు. ఫలితంగా మళ్లీ కథ మొదటికే వచ్చింది. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువుపై పనికిరాని పచ్చదనం పరుచుకున్నది. గుర్రపు డెక్క ఉన్న కొద్ది నీటిని ఆవరించేసింది. ఎవరైనా చెరువులో దిగితే అంతే సంగతి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుంటే బాగుంటుంది.*

**- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ.**



ఖానాపూర్ చెరువులో గుర్రపు డెక్క

# గంజాయిపై నిఘా

- పలువురిపై కేసు నమోదు
- రైతులు పండిస్తే పథకాలు బంద్



గంజాయి నిందితులతో సీఐ, ఎస్ఐ, సిబ్బంది

ఉట్నూర్, ఏప్రిల్ 13 : ప్రభుత్వ నిషేధిత గంజాయితో యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కొందరు మత్తులో మరణిస్తుండే మరికొందరు అధిక సంపాదన ఆశతో సరఫరా చేస్తూ పట్టుబడి జైలుపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల కరీంనగర్, హైదరాబాద్, జగిత్యాల్ వంటి పట్టణాల్లో గంజాయి కేసులు నమోదు కాగా.. వాటి మూలాలు మనవద్దే ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో ఇటీవల ముమ్మర తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల్లో ఏకంగా పదికిలోల గంజాయి పట్టుకోవడమే కాకుండా పది మందిపై కేసు కూడా నమోదు చేశారు. ఏజెన్సీలో రైతులు పండిస్తే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా.. వారికి ప్రభుత్వ పథకాలైన రైతుబం ధు, సబ్సిడీ విత్తనాలు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అమాయక గిరిజనులు గంజాయితో నష్టపోకుండా ఉడేందుకు పోలీసులు మీకోసం పేరిట గంజాయిపై గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. అలాగే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### మూడు రోజుల్లో పది మందిపై కేసులు

మండలంలోని కుమ్మరితండా పరిధిలోని రాముగూడలో దాడులు నిర్వహించి కుమ్ర సోనేరావు ఇంటి వెనుకాల ఉన్న అరటి పెరడిలో సుమారు 20 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. రైతుపై కేసు నమోదు చేయడమే కాకుండా ప్రభుత్వ పథకాలు రాకుండా కలెక్టర్ ప్రతిపాదించారు. అలాగే పట్టణం మీదుగా ఆటోలో ముగ్గురు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో ఐటీడీఏ సమీపంలో ఆటోను తనిఖీ చేసి బేల మండలంలోని పార్సువాడకు చెందిన మారుతి విక్రయించగా అతనితోపాటు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. అలాగే ఇటీవల మండలంలోని బీర్సాయిపేట్‌కు చెందిన ఎల్లయ్యతో మండలంలోని లక్కేటిపేట్‌కు చెందిన గంగన్న ఐదు కిలోల గంజాయిని మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు కరీంనగర్, హైదరాబాద్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉండడంతో పోలీసులు దాడులు చేసి వారిని రిమాండ్‌కు పంపారు. అలాగే ఇటీవల మండలంలోని ఎక్స్‌రోడ్ పెట్రోల్ పంప్ వద్ద పల్సర్ బైక్‌పై జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన అనిల్, గౌతంలు ఆదిలాబాద్ మండలం అశోర గ్రామంకు చెందిన రాహు వద్ద కిలోన్నర గంజాయిని కొనుగోలు చేసి తరలిస్తుండగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఇలా మొత్తానికి పది మందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు.

రాముగూడలో గంజాయి మొక్కలను తొలగిస్తున్న ఎస్ఐ



### అవగాహన కార్యక్రమాలు

గంజాయి పండిస్తూ, అమ్ముతూ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. కళాజాత టీంలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గంజాయి సేవించడం ద్వారా అనారోగ్యం పాలు కావడం, రోడ్డు ప్రమాదాలు, పోలీసు కేసులు కావడం, అసాంఘిక కార్యకలాపాలు జరగడం వంటి వాటిపై పోలీసులు గిరిజన పెద్దలకు అవగాహన కల్పిస్తున్నారు. దీని ద్వారా యువత చెడు మార్గంలో నడవకుండా పెద్దలు అడ్డు పడతారని భావిస్తున్నారు.

### యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి..

*యువత ఉన్నత లక్ష్యాలతో మంచి మార్గాలలో పయనించాలి. ఇటీవల గంజాయి కేసులలో అధిక భాగం యువత ఉండడం చాలా బాధాకరం. అందుకే గంజాయితో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ సింగ్ ఆదేశాలతో గ్రామాలలో పెద్దలకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి కేసులో కనీసం బెయిల్ కూడా దొరకదన్న విషయాన్ని వివరిస్తున్నాం. ఇటీవల పలు కేసులలో ఏజెన్సీ ప్రాంతం వారికి లింకులు ఉన్న విషయాన్ని గ్రహించాం. వెంటనే ఏజెన్సీలో అమాయక గిరిజనులు గంజాయి భారిన పడకుండా ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నాం. రైతులు పండిస్తే వారిపై కేసులు నమోదు చేస్తూ గంజాయి పంటను నాశనం చేస్తున్నాం. రైతులకు ప్రభుత్వ పథకాలు రాకుండా అధికారులకు వివరాలు పంపుతున్నాం. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ మెరుగైన జీవితం గడపాలన్నదే తమ లక్ష్యం. దీనికోసం పోలీసులకు సహకరించాలని, యువత సన్మార్గంలో నడపాలని కోరుతున్నాం.*

**- ఉట్నూర్ సీఐ మొగిలి**